క్లుప్తంగా

36 మందికి జాతీయ రత్న ఉగాది పురస్కారాలు



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళాపరిషత్ సంయుక్తంగా సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జాతీయ రత్న ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించాయి. సంస్థ వ్యవస్థాపకుడు పి.ఎ.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు పైడా కృష్ణప్రసాద్, కంచర్ల అచ్యుతరావు వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 36 మందిని పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన సంప్రదా య, శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఆచార్య వి.బాలమోహన్‌దాస్, దుగ్గవలస దివాకర్, సినీ నటుడు ప్రసన్నకుమార్, సింగంశెట్టి సత్యనారాయణ, సన్ మూర్తి, కెంబూరి చంద్రమౌళి, ఎల్.ఆర్.కృష్ణబాబు పాల్గొన్నారు.

రామాయణ పాటలపై ప్రవచనాలు



ప్రవచిస్తున్న ఆచార్య మలయవాసిని

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో వసంత నవరాత్రుల సందర్భంగా సోమవారం సాయంత్రం రామాయణ ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. మహిళల రామాయణపు పాటలపై నాలుగు రోజులు ప్రసంగాలు జరగనున్నాయి. తొలి రోజు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మహిళల రామాయణపు పాటల వైశిష్ట్యాన్ని, జానపద రామాయణాల గురించి అనేక విషయాలు వివరించారు. రామాయణ గ్రంథాల్లో లేని విషయాలు, జానపద స్త్రీలు తమ ఆలోచనలు, నమ్మకాలకు అనుగుణంగా భావించి పాడుకున్నారని, ఈ కథలు చాలా ఆసక్తికరంగా ఉండటమే కాకుండా పాడుకోడానికి వీలుగా ఉంటాయన్నారు. రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు పాత్రలను తమ కుటుంబ సభ్యుల్లా భావించి ఆత్మీయంగా పాడుకున్నారని చెప్పారు. అనంతరం ప్రవచన కర్తను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించారు.

పాస్టర్ ప్రవీణ్ పోస్టుమార్టం నివేదిక వెల్లడించాలి

- వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ



మహారాణిపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం చేస్తున్న కాలయాపన వల్ల రాష్ట్రంలోని క్రైస్తవులు, ఇతర మతాల మధ్య లేనిపోని విభేదాలు పెరిగి సామాజిక మాధ్యమాల్లో మాటల యుద్ధానికి దారితీస్తోందని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. లలితానగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడారు. ప్రవీణ్ మృతి చెందిన సంఘటనా స్థలం నుంచి శవ పంచనామా, పోస్టుమార్టం చేసి శవాన్ని బంధువులకు అప్పగించే వరకు సరైన విధానం లేకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం వల్లే ఈ పరిస్థితికి కారణమన్నారు. పోస్టుమార్టం జరిగి వారం కావస్తున్నా రిపోర్టు వెల్లడించకపోవడం దారుణమన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే ఇలాంటి అంశాల్లో కేసు తీవ్రతను బట్టి ఒకటి రెండు రోజుల్లోనే పోస్టుమార్టం నివేదికను ప్రక టించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వమే ప్రజల్లో అనుమానాలు రేకెత్తించే విధంగా ప్రవర్తిస్తుందని ఆరోపించారు. క్రైస్తవ సమాజం ఎంతో ఓపికతో ప్రభుత్వ సమాధానం కోసం ఎదురు చూస్తుందన్నారు. ఈ అంశంలో కొన్ని పత్రికలు తమ సొంత కథనాలను వండి వారుస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ప్రవర్తిస్తున్నాయన్నారు. వీటి వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే దానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా వెంటనే పోస్ట్ మార్టం రిపోర్టు, దర్యాప్తు వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని జాన్ వెస్లీ కోరారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తర నియోజకవర్గంలో జాతీయ రహదారిపై పలు చోట్ల అత్యాధునిక సదుపాయాలతో స్మార్ట్ బస్‌షెల్టర్లు నిర్మించింది. తొలి విడతగా సుమారు రూ.2.48 కోట్లతో రేసపువానిపాలెం, గురుద్వారా, అక్కయ్యపాలెం కూడలి రెండు వైపులా, పోర్టు ఆస్పత్రి కూడలి వద్ద నార్త్ సౌత్ వైపు స్మార్ట్ బస్‌బేలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించారు. రెండో విడతలో మరికొన్ని చోట్ల బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రతిపాదన ఉండగా.. ఎన్నికల కోడ్ వచ్చి పనులు నిలిచిపోయాయి. **కూటమి ప్రభుత్వంలో కొత్త బస్ షెల్టర్ల ఊసే లేదు.** - సీతంపేట



సీతంపేట కూడలిలో బస్ కోసం చెట్టు కింద నిరీక్షిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ప్రయాణికుల పాట్లు పట్టవా..?

అవసరమైన చోట కానరాని బస్ షెల్టర్లు

ఉన్న చోట ఆగని బస్సులు

అవస్థలు పడుతున్న ప్రయాణికులు

షెల్టర్లలో సదుపాయాలు నిల్

మండుటెండైనా, వాన కురుస్తున్నా బస్సుల కోసం ప్రయాణికులు చెట్ల కింద, షాపుల వద్ద నిరీక్షించాల్సిందే. టికెట్టు ధరలు పెంచడంలో ముందుండే ఆర్టీసీ.. సదుపాయాలు కల్పించడంలో వెనుకబడిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్ షెల్టర్లు ఉన్న చోట బస్సులు ఆగవు. అవి ఆగే చోట షెల్టర్లు ఉండవు. ఇది స్మార్ట్ సిటీలో ప్రయాణికుల అవస్థల తీరు.

చెట్టు కిందే నిరీక్షణ..

నగరంలోని ద్వారకానగర్ బీవీకే కళాశాల ఎదురుగా రెండు బస్ షెల్టర్లు నిర్మించారు. అక్కడ బస్సులు ఆగడం లేదు. సీతంపేట కూడలిలో బస్సులు ఆపే చోట షెల్టర్ నిర్మించకుండా వదిలేశారు. సీతంపేట కూడలిలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు చెట్టు కిందే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

పెట్రోల్ బంక్ నీడలో..

ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మద్దిలపాలెం కూడలి వరకు ఆర్టీసీ బస్సులు బీఆర్‌టీఎస్ మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉంది. దానికి అనుగుణంగా బీఆర్‌టీఎస్ మార్గంలో బస్ షెల్టర్లు నిర్మించారు. కాంప్లెక్స్ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్లే బస్సులు బీఆర్‌టీఎస్ మార్గంలో ప్రయాణించకుండా సర్వీస్ రోడ్‌లో వెళ్లడంతో బస్ షెల్టర్లు లేక స్వర్ణభారతి స్టేడియం వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంక్ నీడలో ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు.

షెల్టర్లు, సదుపాయాలు అవసరం

గురుద్వారా, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ పాలబూత్ సెంటర్, సంఘం ఆఫీస్ కూడలి వద్ద ఒకవైపు మాత్రమే బస్ షెల్టర్లున్నా.. సరైన సదుపాయాలు లేవు. ప్రయాణికులు కూర్చునేలా బెంచీలు లేక ఇబ్బంది పడుతున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో రెండో వైపు బస్ షెల్టర్లు లేవు. గతంలో ఎస్‌కే ఎంఎల్ బ్యాంక్ వద్ద, సంఘం ఆఫీస్ కూడలిలో మరో బస్ షెల్టర్ ఉండేవి. నిర్వహణ లేక శిథిలమవడంతో వాటిని తొలగించారు. ఎండా కాలం దృష్ట్యా బస్ షెల్టర్లలో సదుపాయాలు కల్పించాలని, బస్సులు ఆగే చోట షెల్టర్లు పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో సదుపాయాలు లేని బస్ షెల్టర్



జీవీకే కళాశాల వద్ద నిరుపయోగంగా రెండు బస్ షెల్టర్లు



అక్కయ్యపాలెం దాలిరాజు సూపర్ మార్కెట్ వద్ద బస్ షెల్టర్‌లో ఇనుప బెంచీ

చెట్టు నీడే బస్ షెల్టర్

సీతంపేట నుంచి ఇటు తాటిచెట్లపాలెం, ఎన్ఏడీ, గాజువాక, కైలాసపురం.. అటు ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ, పూర్ణా మార్కెట్ ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా సీతంపేట కూడలిలో బస్సుల కోసం నిత్యం చాలా మంది నిరీక్షిస్తుంటారు. ఇక్కడ బస్ షెల్టర్ లేక చెట్టు నీడలో నిలబడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– వై.వెంకటరమణ, సీతంపేట

ప్రయాణికులకు ఇబ్బందే..

కంచరపాలెం నుంచి నేను ప్రతి రోజూ సీతంపేటలోని ఒక ఆఫీస్‌కు వస్తుంటాను. తిరిగి ఇంటికి వెళ్లడానికి బస్ కోసం సీతంపేట జంక్షన్‌లో నిరీక్షిస్తుంటాను. ఇక్కడ బస్ షెల్టర్ లేదు. ఎండలో నిలబడాల్సి వస్తోంది. బస్ కోసం ఎదురు చూడలేక మధ్యాహ్నం వేళల్లో ఆటోలో వెళ్తుంటాను. ఇక్కడ ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– జి.కిరణ్‌కుమార్, ప్రైవేటు ఉద్యోగి

‘గైస్’లో శిథిలమైన ప్రహరీ



కూలిన ప్రహరీ స్థానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రక్షణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో పాత భవనం ప్రవేశ ద్వారానికి ఎదురుగా ఉన్న గోడ ఇటీవల కూలిపోయింది. ఈ కాలేజీ స్థలం రక్షణకు 1979లో గోడ నిర్మించారు. ఐటీఐ పరిసరాలతోపాటు పోలీస్ స్టేషన్, సర్వీస్ రోడ్డు పరిసరాల నుంచి యువకులు, ఆకతాయిలు లోపలికి ప్రవేశించి కాలేజీ ఆస్తులకు నష్టం కలిగించేవారు. దీంతో కాలేజీ చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీన్ని పటిష్టంగా నిర్మించకపోవడంతో హుద్‌హుద్ తుఫాన్ సమయంలో కొంత భాగం పాడైంది. అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు ఆధ్వర్యంలో దీనికి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ప్రస్తుతం గోడ పూర్తిగా శిథిలమైంది. ఏమాత్రం భారీ వర్షాలు కురిసినా అనేక చోట్ల కూలిపోయే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఐటీఐ సమీపంలో 200 మీటర్ల గోడ కూలిపోయింది. ఎవరూ లేని సమయంలో బయట వైపు గోడ కూలడం వల్ల ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ కాలేజీలో బాలికలు ఎక్కువ సంఖ్యలో చదువుతున్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ దీనిపై తక్షణం చర్యలు తీసుకుని టిప్లాన్ షీట్లతో తాత్కాలిక రక్షణ కల్పించారు. శాశ్వత పరిష్కారంలో భాగంగా పూర్తి స్థాయిలో రక్షణ గోడను పటిష్టంగా నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అలరించిన శ్రీరామదాసు కీర్తనలు

ఎంవీపీకాలనీ: లలిత సప్తస్వరాల సభ్యులు ఆలపించిన శ్రీరామదాసు, త్యాగరాజు కీర్తనలు అలరించాయి. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వసంతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం లలిత సప్తస్వరాల సభ్యులచే సంగీత విభావరి నిర్వహించారు. బ్రోచేవారు ఎవరు, పలుకే బంగారమాయెలే, సీతారామ కల్యాణ వైభోగం వంటి భక్తిరస గీతాలతో వారు అలరించారు. భక్తులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం ఎస్ఐ కావలెను..

- ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో నాలుగు స్తంభాలాట
- వచ్చిన ఎస్ఐకు బదిలీ, భర్తీ కాని పోస్ట్
- ఇన్‌చార్జులతోనే కాలయాపన.. సిబ్బంది అవస్థలు



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఖాళీగా క్రైం ఎస్ఐ సీటు

సీతమ్మధార: నగరంలోనే ఎంతో కీలకమైన నాలుగో పట్టణ క్రైం ఎస్ఐ పోస్ట్ భర్తీ కాకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఏ ముహూర్తాన ఇక్కడి క్రైం ఎస్ఐ బదిలీ అయ్యారో గాని ఒక పట్టాన ఈ పోస్టు భర్తీ అయిన పాపాన పోవడం లేదు. వచ్చిన వారు కూడా కుదురుకునే ముందే బదిలీ చేసేయడం గమనార్హం. ఇక్కడ క్రైం ఎస్ఐగా పనిచేసిన భాస్కరరావు గతేడాది జనవరి 19న ఎటాచ్‌మెంట్ కింద బాధ్యతలు స్వీకరించారు. గత సెప్టెంబర్ 19న బదిలీ మీద పీఎం పాలెం స్టేషన్‌కు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు పూర్తిస్థాయి అధికారితో భర్తీ కాకపోవడం గమనార్హం. ఫలితంగా దిగువ స్థాయి సిబ్బంది అదనపు భారంతో అవస్థలు పడుతున్నారు.

పట్టుమని పది రోజులే..

భాస్కరరావు బదిలీ తరువాత రెండో పట్టణ క్రైం ఎస్ఐ సునీల్‌కు ఎటాచ్‌మెంట్ ఇచ్చి క్రైం ఎస్ఐగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కేవలం వారం రోజులకే సీసీఎస్‌కి చెందిన ఎస్ఐ దేముడునాయుడికి ఎటాచ్‌మెంట్ ఇచ్చారు. పట్టుమని పది రోజులు మాత్రమే ఉండడం విశేషం. తరువాత ఆయన స్థానంలో హార్బర్ స్టేషన్‌కు చెందిన క్రైం ఎస్ఐ సురేష్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈయన కూడా పది రోజులకే బదిలీ కావడం గమనార్హం. ఇతని స్థానంలో మళ్లీ టూ టౌన్ క్రైం ఎస్ఐ సునీల్‌కే రెండో సారి ఎటాచ్‌మెంట్ ఇచ్చారు. వాస్తవానికి మహారాణిపేట క్రైం ఎస్ఐగా పనిచేస్తున్న సత్యారావు నాలుగో పట్టణ క్రైం స్టేషన్ ఎస్ఐగా గతేడాది నవంబర్ 27న బదిలీపై వచ్చారు. నాలుగు నెలలు పూర్తికాక ముందే ఆనందపురం క్రైం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. మళ్లీ టూ టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న క్రైం ఎస్ఐ సునీల్‌కు ఇన్‌చార్జిగా వేశారు. దీంతో ఇక్కడ క్రైం ఎస్ఐ పోస్టు నాలుగు స్తంభాలాట చందంగా మారిందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఎప్పుడు ఎవరు ఇన్‌చార్జి క్రైం ఎస్ఐగా ఉంటున్నారో ఎవరికీ తెలియని అయోమయ పరిస్థితి నెలకొంటుందని ఫిర్యాదుదారులు అంటున్నారు.

నత్తనడకన కేసుల దర్యాప్తు

పూర్తి స్థాయి క్రైం ఎస్ఐ లేకపోవడంతో ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల కేసుల దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. పలు చోరీ కేసులు, చైన్‌స్నాచింగ్ కేసుల దర్యాప్తులది ఇదే పరిస్థితి. రెగ్యులర్ ఎస్ఐ లేకపోవడంతో హెడ్ కానిస్టేబుల్, కేసులు కట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా కేసుల దర్యాప్తు మీద పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతోందని పలువురు స్థానికులు అంటున్నారు. వెంటనే క్రై ఎస్ఐ పోస్టును భర్తీ చేయాలని కోరుతున్నారు.

వైభవోపేతంగా భావనా రుషి కల్యాణం



సీతంపేటలో నిర్వహిస్తున్న భద్రావతి సమేత భావనా రుషి స్వామి కల్యాణం

సీతంపేట: సమస్త సృష్టికే వస్త్రాలను సృష్టించి ఇచ్చిన శ్రీభద్రావతి సమేత భావన రుషి స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీతంపేటలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని తరించారు. అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు, రాజమహేంద్రవరానికి చెందిన బ్రహ్మర్షి ఆమంచి ఆంజనేయ గురుస్వామి నేతృత్వంలో వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో సుమారు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం మేళతాళలతో భద్రావతి సమేత భావనా రుషి స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు పుర వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా హారతులిచ్చి స్వామికి నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుదే రాజు, ప్రతినిధులు గుదే వేణు, గుదే త్రినాథ్, పప్పు ప్రసాద్, బేతా అప్పారావు, ఆకుల శ్రీనివాస్, పెంటకోట శ్రీను, దొడ్డి వాసు, ఉజ్జూరు కృష్ణ, ఈమంది అప్పారావు, బడిగంటి శంకరరావు, పెంటపల్లి సీతారాం, కోసూరి శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాణిజ్య సంస్థలు, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ ఉచితం

దాబాగార్డెన్స్: వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ రుసుం వసూళ్లపై పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ(ఎంఏయూడీ) ఉత్తర్వుల్ని ఈ నెల 1 నుంచి తప్పనిసరిగా అమలు చేయాలని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్(క్రో) ఏపీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా ఉత్తర్వుల మేరకు మాల్స్, మల్టీప్లెక్స్‌ల్లో షాపింగ్ బిల్, సినిమా టికెట్ చూపిన వారి నుంచి ఎలాంటి పార్కింగ్ రుసుం వసూలు చేయడానికి వీల్లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ మోడల్ బిల్డింగ్ బైలాస్–2016 ఆధారంగా రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్యకలాపాలకు వర్తించే ఏపీ బిల్డింగ్ రూల్స్–2017ను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అందులో పేర్కొన్నట్లు భవనాల్లో పార్కింగ్ స్థలం తప్పనిసరన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పార్కింగ్ దుర్వినియోగ నిరోధానికి పురపాలక శాఖ తాజా మార్గదర్శకాలు ప్రతిపాదించినట్లు తెలిపారు. తొలి అర్ధగంట వరకు పార్కింగ్ ఉచితమని, 30 నిమిషాలు పైబడి గంట వరకు వాహనం పార్కింగ్ చేసిన వ్యక్తి ఆ మాల్లో ఎంతైనా బిల్లింగ్ చేసినట్లు రసీదు చూపితే అది కూడా ఉచితమేనన్నారు. గంటకు పైగా పార్కింగ్ చేసినవారు సంబంధిత మాల్/మల్టీప్లెక్స్‌లో షాపింగ్ చేసినట్లు రుజువు చూపించకపోతే పార్కింగ్ రుసుం వసూలు చేయవచ్చన్నారు. షాపింగ్ బిల్లు, సినిమా టికెట్ చూపిస్తే ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ధిక్కరిస్తే చర్యలు తీసుకోవడం తప్పదన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు
- ముస్లిం యువత, చిన్నారుల సందడి



53వ వార్డు మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అక్కయ్యపాలెంలో సంప్రదాయ వస్త్ర ధారణలో ముస్లిం యువత సందడి



రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



పెద్దూరు ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



అయ్యప్పనగర్ మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



సంప్రదాయ దుస్తుల్లో ముస్లిం యువకులు

సీతంపేట: నియోజకవర్గంలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం, కంచరపాలెం ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్-ఎ-క్యూబా, అక్కయ్యపాలెంలోని చిన్నూరు, పెద్దూరు మసీదులు, రేసపువానిపాలెం యాసిన్ మసీదులో ముస్లింలు పెద్ద సంఖ్యలో నమాజు చేశారు. చిన్న పెద్దా ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తెల్లని వస్త్రాలు ధరించి మసీదులకు, ఖబ్రస్తాన్‌లకు వెళ్లి ప్రార్థనలు చేసారు.

పేదలు, అనాథలకు దానాలు

26వ వార్డు రామకృష్ణానగర్ చోటీబస్తీలో మసీద్ ఈ నూర్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు అధిక సంఖ్యలో నమాజ్ చేశారు. మత పెద్దలు, మసీద్ ప్రతినిధులు ఖురాన్ చదివి వినిపించారు. నమాజ్‌కు ముందు పేదలు, అనాథలకు ఫిత్రా, జకాత్ దానాలు చేశారు. జగ్గారావు బ్రిడ్జి వద్ద ఖబ్రస్తాన్‌లో పెద్దల సమాధుల వద్ద ముస్లింలు ప్రార్థనలు జరిపారు. 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని మసీద్ ఈక్యూబా, 80 ఫీట్ రోడ్ ఈద్గాలో పెద్ద సంఖ్యలో ముస్లింలు నమాజ్ చేపట్టారు. అబిద్‌నగర్‌లో షియా ముస్లింలు ప్రార్థనలు చేశారు.

ముస్లింల ప్రార్థనలు, ర్యాలీ

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్‌లోని మస్జీద్–ఈ–అల్‌ఖదీర్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలంతా మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. అనంతరం ఈద్గా వద్దకు చేరుకుని ఈద్–ఉల్–ఫితర్ నమాజ్ ఆచరించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమీపంలోని ముస్లిం శ్మశానవాటికకు వెళ్లి పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన చేశారు. కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నల్ల రిబ్బన్‌తో నిరసన

వక్ఫ్ బిల్లు ఆస్తులను రక్షించండి అంటూ ముస్లింలందరూ నల్ల రిబ్బన్‌తో నిరసన చేపట్టారు. వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా తమ చేతికి నల్ల రిబ్బన్ కట్టుకుని ఈద్ నమాజ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ పార్లమెంట్‌లో ప్రవేశపెడుతన్న నేపథ్యంలో బిల్లును అడ్డుకోవాలని, అది ఆమోదం పొందితే ముస్లిం సమాజానికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఘనంగా వేడుకలు

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని మసీదుల్లో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్పనగర్‌లోని మసీదు–ఇ–నభవిలో మసీదు అధ్యక్షుడు శిరాజుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం మురళీనగర్, మాధవధార పరిసరాలకు చెందిన ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మౌలానా ఖమర్ ఆలం రంజాన్ ప్రాధాన్యాన్ని తెలిపి ముస్లింలతో నమాజ్ చేయించారు. అనంతరం ఖర్జూరం, షర్బత్ అందించారు.

మది దోచిన మధుర గీతాలు



ఇళయరాజా పాటలు ఆలపిస్తున్న కళాకారులు

దాబాగార్డెన్స్: స్వర రాగ సుధ అధ్యక్షుడు నేరెళ్ల రమేష్ నేతృత్వంలో స్థానిక అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మేస్ట్రో ఇళయరాజా స్వర పరచిన గీతాలతో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. కడలి, రాధ పాడిన ఓ ప్రియా ప్రియా, రమేష్, రంజితల పట్టి తెచ్చానులే, మెలోడీ సత్యనారాయణ, భాగ్యలక్ష్మిల కలయా నిజమా, ఎమ్మెస్ మాధవ్, మణిల ఎదలో తొలి వలపే, ఎస్ఎన్ రావు, సీవీ రాజేశ్వరి ఆలపించిన నీవేగా నా ప్రాణం, అవినాష్, సుజాతల చలీ చలీ నా కొక్కొరకో, దేవరాజ్, మాధవీలత చిరు గాలి వీచెను.. తదితర పాటలు రస హృదయాలను రంజింపజేశాయి. కీబోర్డ్ ప్లేయర్ సోమేష్ బృందం సంగీత నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీస్వరూప వ్యాఖ్యానం అలరించింది. కార్యక్రమంలో కళారంగ ప్రతినిధి చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.